క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఏలూరు (టూటౌన్): ఇటీవల కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అదే గ్రామానికి చెందిన సాయిల దుర్గాప్రసాద్ (17), బోడావుల దుర్గాప్రసాద్ (18) అనే యాదవ యువకుల కుటుంబాలను జిల్లా యాదవ సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. వారికి సంఘం తరుపున రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. సంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ తదితరులు యువకుల తల్లిదండ్రులు, బంధువులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు.

హోం మంత్రి మాటలు అర్థరహితం

ఏలూరు రూరల్ : పల్నాడు జిల్లాలో హత్యలను అడ్డుకోలేకపోయిన హోం మంత్రి వంగలపూడి అనిత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అనుచిత వాక్యలు చేయడం అర్థవదరహితమని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరితే జగన్‌నే విమర్శించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. హోం మంత్రి మాటలు బాధ్యత రాహిత్యంతో కూడుకున్నవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ టీడీపీ నాయకులను ఉసిగొల్పి రాష్ట్రంలో అరాచకాలను సృష్టిస్తుంటే హోం మంత్రి స్థానంలో ఉండి అనిత చూస్తుండడం తప్ప చేసేదేమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సైతం మిన్నకుండిపోవడం అన్యాయన్నారు. ఇదే ఒరవడి కొనసాగితే ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోతున్న ఇల్లు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం కలకుర్రులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం ఉదయం పొట్నూరి రామారావుకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ఇంటిలో బీరువా, మంచం, విలువైన ఫర్నిచర్, దుస్తులు, వంట సామాన్లు కాలిపోయాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. సుమారు రూ.2.50 లక్షల విలువైన సామగ్రి కాలి బూడిదైందని సర్పంచ్ బలే నాగప్రసాద్ తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, గ్రామ పెద్దలు మండల రాజేంద్ర ప్రసాద్, ఘంటసాల కాసులు, సైదు వెంకటేశ్వరరావు తదితరుల సమక్షంలో బాధిత కుటుంబానికి రూ.10 వేలు సాయం అందించింది.

పాఠశాలల్లో వారంరోజుల పండుగ

- శిక్షా సప్తాహ్ నిర్వహణకు ఏర్పాట్లు
- రోజుకో ప్రత్యేక కార్యక్రమం
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ



శనివారపు పేటలోని ఎంపీపీ పాఠశాల

ఏలూరు నియోజకవర్గంలో..	
ఏలూరు అర్బన్ పాఠశాలలు	65
విద్యార్థులు	8,295
రూరల్ పాఠశాలలు	57
విద్యార్థులు	6613

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ బడుల్లో నేటి నుంచి శిక్షా సప్తాహ్ పేరిట వారం రోజుల పండుగ నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఎస్‌ఈపీ) – 2020 నాలుగేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు రోజుకో కార్యక్రమం చొప్పున వారం రోజుల పాటు ఈ పండుగ నిర్వహించనున్నారు. ఏలూరు నియోజకవర్గంలోని 122 ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ శిక్షా సప్తాహ్ నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి రూపావతు రంగయ్య ఆదేశించారు. వాస్తవానికి ఈ శిక్షా సప్తాహ్ ఈనెల 22వ తేదీన ప్రారంభమై ఈ నెల 28 వరకు నిర్వహించాల్సి ఉండగా ప్రారంభ రోజైన సోమవారం జిల్లాలో భారీ వర్షాల కారణంగా అన్ని పాఠశాలలకూ సెలవు ప్రకటించడంతో తొలిరోజు షెడ్యూల్ ప్రకారం ప్రారంభం కాలేదు. మంగళవారం షెడ్యూల్ ప్రకారం రెండో రోజు చేయాల్సిన కార్యక్రమంతో శిక్షా సప్తాహ్ ప్రారంభం కానుంది.

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

- ఈ నెల 22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన చేయాలి. భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమం జరగలేదు. మరో రోజు నిర్వహిస్తారు.
- 23న పునాది అభ్యసన కార్యక్రమం. ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు చర్చ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది.
- 24న క్రీడా దినోత్సవం. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్స్, పరుగు పందాలు వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించాలి.
- 25న సాంస్కృతిక దినోత్సవం. విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వ భావాన్ని పెంపొందించేలా చేయడంతోపాటు విభిన్న నృత్య ప్రదర్శనలు, పాటలు, గేయాలాపన వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి.
- 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం. స్కిల్, డిజిటల్ ఇనీషియేటివ్‌లో భాగంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో లభిస్తున్న ఉద్యోగావకాశాలను దృష్టిలో ఉంచుకుని, తరగతి గది అనుభవాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలి.
- 27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం. మెషీన్ లైఫ్ యాక్టివిటీస్. న్యూట్రిషన్ డే, పాఠశాలల్లో కొత్త ఏకో క్లబ్స్ ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలి.
- 28న సామాజిక భాగస్వామ్యం. పాఠశాల అభివృద్ధిలో ప్రజలు, దాతలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం ప్రధాన ఉద్దేశం. ప్రముఖుల పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో భోజనాల ఏర్పాటు, పాఠశాల విద్యార్థులతో కలిసి స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం చేయాలి.

శిక్షా సప్తాహ్‌ను విజయవంతం చేయాలి



జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో శిక్షా సప్తాహ్ తొలిరోజు కార్యక్రమం నిర్వహించలేదు. దీనిని సప్తాహ్ ముగిసిన తరువాత మరో రోజు నిర్వహిస్తాం. మంగళవారం నుంచి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు కొనసాగుతాయి. ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలి.

– ఎస్ అబ్రహాం, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు బీడీ కాలానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పి.వెంకట నాగశ్రీనివాస్ (45), తన భార్య లావణ్య కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. ఈనెల 20న భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడటంతో శ్రీనివాస్ తీవ్ర మనస్తాపంతో పారాసెట్మాల్ ట్యాబ్లెట్స్ అధిక మోతాదులో వేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి, చికిత్స పొందుతూ నాగశ్రీనివాస్ సోమవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

2న ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల రెండో తేదీన ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఏలూరు బార్ అసోసియేషన్ చీఫ్ ఎన్నికల అధికారి ఎంవీ నారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ, అనంతరం నామినేషన్ల స్క్రూటీనీ, 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

డ్రైవర్లకు పదోన్నతి వేతనం ఇవ్వాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్‌లోని 8 మందికి, ఇంజిన్ సెక్షన్ మజ్దూర్ ఒకరికి మొత్తం 9 మందికి 2022 మార్చి 30న హెవీ వెహికల్స్ డ్రైవర్స్‌గా పదోన్నతి కల్పించినా నేటికీ వారికి పదోన్నతి వేతనం, ఇంక్రిమెంట్లు, హాడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆరోపించారు. తక్షణమే వారికి పెరిగిన వేతనాలు, ఇంక్రిమెంట్లు కోరుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. పదోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వడంలో హెల్త్ సెక్షన్ సూపరింటెండెంట్, ఇంజినీరింగ్ సెక్షన్ డీఈ తాతబ్బాయి నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి సంక్రాంతి బోనస్ ప్రకటించిందని, ఏలూరు కార్పొరేషన్‌లో పబ్లిక్ హెల్త్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి బోనస్ చెల్లించారని, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, నాయకులు బి.నాగేశ్వరరావు, ఎస్ శ్రీనివాస్, ఎస్ఎంవీ సుబ్బారావు, డ్రైవర్లు మెరుగు గోవిందు, గోరాకుల దుర్గారావు, గాడి అప్పారావు, అంతర్వేది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు రూరల్ చాటపర్రులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,600 స్వాధీనం చేసుకున్నారు.

సాగు పనులు ముమ్మరం

దెందులూరు: మండలంలో వరిసాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భారీ వర్షాలతో రైతులు, వ్యవసాయ కూలీలు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని పొడిగించినట్టు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గత మార్చి 31వ తేదీన ముగిసిన ఈ గడువును వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఏడాది కాలానికి ప్రభుత్వం పొడిగించినట్టు పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కొనసాగుతున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌కు ఇది సమాంతరంగా కొనసాగుతుందని తెలిపారు.

10వ తరగతి మాధ్యమంపై స్పష్టత ఇవ్వాలి

ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు అందరూ ఇంగ్లిష్ మాధ్యమంలోనే పబ్లిక్ పరీక్షలు రాయాలన్న గత ప్రభుత్వ నిబంధనను సడలించి, మాధ్యమం ఎంపికను విద్యార్థుల ఇష్టానికి వదిలివేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మాధ్యమాలు ప్రవేశపెట్టడంతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దోమ అత్యంత ప్రమాదకరమైన కీటకం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు (టూటౌన్): దోమ అత్యంత ప్రమాదకరమైన కీటకమని, దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జేపీ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నీలిమ సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వెంకన్న చెరువు, దక్షిణపు వీధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నీలిమ మాట్లాడుతూ దోమ కాటు ద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. విద్యార్థులు దోమకాటు పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల డయేరియా, జిగట విరోచనాలు, కామెర్లు, టైఫాయిడ్, నులుపురుగు మొదలగు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ దోమలు మన గృహాలు, గృహ పరిసరాల్లో ఉండే నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి మంచి నీరు నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనుక బాక్స్, రుబ్బురోళ్లు, ఫ్లవర్ వాజ్‌లు, పూల కుండీలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమల నిర్మూల సామాజిక బాధ్యతగా ప్రజలు భావించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హైమావతి, హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు.. నీటిని మళ్లించారు





ద్వారకాతిరుమలలోని బైపాస్ రోడ్డు చెత్త కారణంగా నిలిచిన వర్షపు నీరు చెత్తను తొలగిస్తున్న జేసీబీ →

ద్వారకాతిరుమల: స్థానిక పోలీస్ క్వార్టర్స్ మీదుగా వెళ్లే బైపాస్ రోడ్డు డంపింగ్ యార్డుగా మారింది. పారిశుధ్య కార్మికులు గ్రామంలోని చెత్తను తీసుకెళ్లి డంపింగ్ యార్డు సమీపంలోని రహదారిపై వేస్తున్నారు. దీంతో ప్రస్తుత వర్షాలకు ఆ ప్రాంతం నీట మునిగింది. నీరు పక్కనున్న చెరువులోకి పారే వీలులేకుండా చెత్త అడ్డు పడటంతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారింది. అటుగా ప్రయాణించే వీలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి దారుణంగా మారడంతో పంచాయతీ అధికారులు చెత్తను తొలగించి, నీటిని మళ్లించేందుకు సోమవారం చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మొగతడకల ఓం ప్రకాష్ తన సొంత ఖర్చులతో చెత్తను జేసీబీ సాయంతో తొలగింపజేసి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. దాంతో వాహనచోదకులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు ఆ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల సీజ్



వాహనాన్ని సీజ్ చేస్తున్న నిడమర్రు పోలీసులు

నిడమర్రు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను సోమవారం నిడమర్రు, పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తోకలపల్లి పరిధిలోని గ్రామాలకు కోళ్ల వ్యర్థాలతో వాహనం వెళ్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్లు నిడమర్రు ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. తోకలపల్లి గ్రామానికి చెందిన సైదు చిట్టిబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల ధ్వంసం

పెదపాడు: మండలంలోని తోటగూడెం మీదుగా నాయుడుగూడెం వైపునకు కోళ్ల వ్యర్థాలతో వాహనాన్ని పెదపాడు పోలీసులు తోటగూడెం సమీపంలో స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేసినట్లు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

మీసేవ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మీసేవ వెబ్‌సైట్ ఆన్‌లైన్ సేవలను ప్రభుత్వం తక్షణమే కొనసాగించాలని డీవైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జంగారెడ్డిగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు మీసేవ సెంటర్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కమ్ సర్టిఫికెట్ లేక అడ్మిషన్ అయ్యేందుకు వీలుపడకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల అన్ని రకాల సేవలు గల ఆన్‌లైన్ వెబ్‌సైట్ తక్షణమే కొనసాగింపు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	33
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	19

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	54	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10,12
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	34
కాకర కాయలు	44-54	కీరా దోస	48
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	36	అల్లం	100-170
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	15-20
క్యారెట్	34-54	పాలకూర	12-15
దొండకాయలు	34	చుక్కకూర	12-15
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	50

నాటు పుట్టగొడుగులకు యమ డిమాండ్



అటవీ ప్రాంతంలో పెరుగుతున్న పుట్టగొడుగులు

బుట్టాయగూడెం: పుట్టగొడుగుల కాలం రానేవచ్చింది. గిరిజన ప్రాంతంలో వర్షాలు కురవగానే అటవీప్రాంతంలో ఉన్న పుట్టల్లో నాటు పుట్టగొడుగులు అత్యధికంగా లభిస్తుంటాయి. భారీ వర్షాలతో పుట్టలపై పుట్టగొడుగులు కనిపిస్తున్నాయి. దీంతో అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గిరిజనులు నాటు పుట్టగొడుగులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. 25 నుంచి 30 పుట్టగొడుగులను ఒక కట్టగా కట్టి సుమారు రూ.100కు గిరిజనులు విక్రయిస్తున్నారు. అడవిలో లభించే నాటు పుట్టగొడుగులకు అధిక డిమాండ్ ఉండడంతో అడవి నుంచి తీసుకువచ్చి వెంటనే అమ్ముడుపోతున్నాయి. అయితే పుట్టగొడుగుల సేకరణ అంత సులభమైన పనికాదు. తెల్లవారుజామునే అటవీప్రాంతానికి వెళ్లి పుట్టలపై ఉన్న పుట్టగొడుగులను సేకరించాలి. ఒక్కోసారి ఆ పుట్టల్లో పాములు కూడా ఉంటాయి. అలాగే చీమలు కూడా కుడతాయి. పుట్టగొడుగులకు వెళ్లిన గిరిజనులు విషపురుగుల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. అయితే ఏటా వర్షాకాల సీజన్‌లో ఈ ప్రాంతానికి వచ్చి పుట్టగొడుగులను తీసుకువెళ్లినవారు ఉన్నారు. ఈ ఏడాది కూడా వర్షాలకు పుట్టగొడుగులు లభించడంతో వాటి కోసం అనేక మంది ఏజెన్సీకి క్యూ కడుతున్నారు. కొంత మంది వీటిని గిరిజన ప్రాంతంలో రూ.100కు కొనుగోలు చేసి బయట ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ. 400 వరకూ విక్రయిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగులు ఎంతో రుచిగా ఉండటమే కాకుండా ఎంతో ఆరోగ్యవంతమైనవని గిరిజనులు చెప్తున్నారు.

ఆధార్ నమోదుకు శిబిరాలు

దెందులూరు: మండలం పరిధిలో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. 23న దెందులూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, 24న జెడ్పీ ఉన్నత పాఠశాల, 25న గోపన్నపాలెం హైస్కూల్, 27న కొవ్వలి హైస్కూల్, 23 నుంచి 24 వరకు పోతునూరు హైస్కూల్, 26న కొత్తగూడెం సచివాలయం, 27న రామారావుగూడెం సచివాలయం, 24 నుంచి 25వ తేదీ వరకు మేధినరావుపాలెం హైస్కూల్, 26, 27న చల్లచింతలపూడి జెడ్పీ హైస్కూల్‌లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.